

లెక్క లేదంటే.. వేటే..!
ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థులు ఖర్చుల వివరాలను నమోదు చేయాలి. బ్యాంకులో ఖాతా తెరిచి దాని ద్వారా చెల్లింపులు చేయాలి. 8లో▸



క్రీడల్లో ఉచిత శిక్షణ
యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వివిధ క్రీడల్లో శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
42.9 /29.6
చాలావరకు ఎండగా ఉంటుంది. అప్పుడప్పుడు మబ్బు పడుతుంది. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ మంజుల

ఆసిఫాబాద్‌రూరల్: ఆర్టీసీ ఉద్యోగులు ప్రతిఒక్కరూ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ మంజుల అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో కొనసాగుతున్న గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0 కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు ఆసిఫాబాద్ డిపోలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డిపో పరిధిలోని 331 మంది ఆర్టీసీ ఉద్యోగులు, 57 మంది ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డ్రైవర్లు, కండక్టర్లు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎం శ్రీనివాస్, ఉద్యోగులు సరియా, శ్రావణ్, ప్రేమల తదితరులు పాల్గొన్నారు.

'సీఎం సభకు తరలిరావాలి'


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

పెంచికల్‌పేట్(సిర్పూర్): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 2న నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ గ్రామంలో.. ప్రతి గడపనూ చేరుకోవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నా యకులు చౌదరి తిరుపతి, సముద్రాల రాజన్న, జాజిమొగ్గ శ్రీనివాస్, చౌదరి శ్రీనివాస్, ఉపాసీ సంజీవ్, ఖైరాత్, రాజన్న, సాజిద్, బండన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలి


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి(ఆసిఫాబాద్): ఆదిలాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. వాంకిడి మండలం మహాగాం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. మాచిగూడ, పూనగూడ, సోనాపూర్, రాజులగూడ, గోయెగాం, మహాగాం గ్రామాల్లో ఓటర్లతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ ప్రజలకు అండగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ పెంటు, ఎంపీటీసీ బిలాజీ, నాయకులు అశోక్ మహోల్కర్, వినోద్, కిష్టు, ఎంగలి రాకేశ్, అహ్మద్ ఖాన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అబ్జర్వర్‌ని కలిసిన ఎస్పీ


చెక్‌పోస్టు వద్ద వివరాలు తెలుసుకుంటున్న పోలీసు అబ్జర్వర్, ఎస్పీ

ఆసిఫాబాద్: పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్ రాజేశ్ కుమార్ సక్సేనాను సోమవారం ఎస్పీ సురేశ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్క అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న భద్రతా చర్యలు గురించి వివరించారు. ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు కళాబృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం రేపల్లెవాడ వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టును తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అతివలే నిర్ణేతలు



- పురుషులతో పోల్చితే 40వేల ఓట్లు అధికం
- ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వారిదే ఆధిపత్యం
- మహిళా ఓట్లపై రాజకీయ పార్టీల ఫోకస్


ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు (ఫైల్)

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం మహిళలే నిర్ణయించనున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలోని ఓట్లలో పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. వారు ఎవరిని అనుగ్రహిస్తారో వారికే విజయం వరించనుంది. నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా ఐదింటిలో మహిళా ఓటర్లదే ఆధిపత్యం కనిపిస్తోంది. గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉండటంతో అన్ని రాజకీయ పార్టీలు వీరిపైనే దృష్టి సారించాయి.

నారీశక్తి.. కీలకం

రాజకీయకంగా పదవులను దక్కించుకోకపోయినా ఏ అభ్యర్థికి పదవిని కట్టబెట్టాలనే స్థాయిలో ఉండటం నారీశక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఇప్పటికే ప్రధాన పార్టీలు మహిళా నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుర్తింపునిస్తామని ఆశలు కల్పిస్తూ ఈ ఎన్నికల్లో తమకు మద్దతుగా నిలువాలని కోరుతున్నారు. పురుషులతో సమానంగా మహిళా నాయకులు ఇంటింటి ప్రచారంలో ముందుంటున్నారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు			
నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
సిర్పూర్	1,14,522	1,14,567	12
ఆసిఫాబాద్	1,12,788	1,14,404	16
ఖానాపూర్	1,09,685	1,14,825	13
ఆదిలాబాద్	1,19,848	1,25,283	06
బోథ్	1,02,458	1,08,852	03
నిర్మల్	1,21,991	1,36,304	19
ముథోల్	1,23,583	1,30,978	18

ఐదు నియోజకవర్గాల్లో అధికం

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 16,50,175 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుష ఓటర్లు 8,04,875 మంది, మహిళా ఓటర్లు 8,45,213 మంది ఉన్నారు. ఇతరులు 87 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్ల సంఖ్య 40,338 అధికంగా ఉంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా ఇందులో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో మాత్రమే పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్ ఐదు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. వీరి ఓట్లు ఎవరికి ఎక్కువగా దక్కుతాయో వారినే విజయం వరించనుంది. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కీలకమైన మహిళా నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రసన్నం చేసుకునే దిశగా కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేసేలా దృష్టి సారిస్తున్నాయి.

ప్రసన్నం చేసుకునే యత్నాలు..

అభ్యర్థుల భవితవ్యం నిర్ణయించే ప్రధాన శక్తిగా ఉన్న మహిళా ఓటర్లపైనే అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. వారిని ప్రసన్నం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ప్రత్యేక తాయిలాలు ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం జూలైలో ముగియనుంది. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా కీలకమైన మున్సిపాలిటీల పదవీ కాలం వచ్చే జనవరిలో ముగియనుంది. అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉన్నందున ఆయా పదవుల్లో తగిన గుర్తింపు ఇస్తామని రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్నాయి. ప్రస్తుతం తమకు మద్దతుగా నిలువాలని కోరుతున్నాయి. మహిళా నాయకులు సైతం పురుషులతో సమానంగా పోటాపోటీగా ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే అగ్రనేతలు వచ్చే సభలకు మహిళలను ఎక్కువగా తరలిస్తూ తాము కూడా తక్కువ కాదనే రీతిలో బలాన్ని చాటుతున్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికల విధుల్లో అధికారులు అలసత్వం ప్రదర్శించొద్దని, ముఖ్యంగా సెక్టార్ అధికారులు తమకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, డీఆర్‌వో లోకేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ ఆర్డీవో కాశబోయిన సురేశ్‌తో కలిసి సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని తప్పనిసరిగా సందర్శించాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు, గర్భిణులు, దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ర్యాంపులు, వేసవి నేపథ్యంలో నీడ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటు ఉంచడం.. తదితర వసతుల కల్పనపై దృష్టి సారించాలని ఆదేశించారు. దివ్యాంగులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మొదటి, రెండో దశ ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు. లోకసభ ఎన్నికల విధుల్లో ఎన్నికల అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. సెక్టార్ అధికారులు ప్రతీ ఈవీఎం పనితీరును పరీక్షించాలని సూచించారు. ఓటరు స్లిప్పులు తప్పనిసరిగా ఓటర్లకు అందజేయాలన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


మురళీగూడ గ్రామస్తులతో కలిసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

- ఎమ్మెల్సీ దండె విఠల్

పెంచికల్‌పేట్(సిర్పూర్): ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ విమర్శించారు. మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో సోమవారం పర్యటించారు. బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి.. అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుబంధు అందక అన్నదాతలు అవస్థలు పడుతున్నారన్నారు. అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలు, రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు బిట్టి శ్రీనివాస్, రాచకొండ కృష్ణ, చిన్నయ్య, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, కోట సతీశ్ ఉన్నారు.

ప్రచార ఖర్చులపై దృష్టి సారించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు వివేకానంద్ రాజేంద్ర జదావర్


మాట్లాడుతున్న పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు వివేకానంద్ రాజేంద్ర జదావర్

ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ప్రచార ఖర్చులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు వివేకానంద్ రాజేంద్ర జదావర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల పోలీసు పరిశీలకులు రాజేశ్ కుమార్ సక్సేనా, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి మోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యయ పరిశీలకుడు వివేకానంద్ రాజేంద్ర జదావర్ మాట్లాడుతూ.. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ ముగిసినందున అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం అభ్యర్థుల ఖర్చు పరిమితిని నిర్ణయించిందని, నిబంధనలు ఉల్లంఘన కాకుండా చూడాలన్నారు. రాజకీయ పార్టీలు ప్రచారంలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలు, ప్రకటనలు, ప్రసారాలు, ప్రతీ అంశాన్ని నిర్దేశించిన ధరల పట్టిక ప్రకారం లెక్కించాలన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే నగదు, మద్యం, బంగారం, కానుకల తరలింపు నియంత్రణలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఫ్లయింగ్ స్టాటిస్టికల్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన, అకౌంటింగ్ బృందాలు, కంట్రోల్ రూం, సీ విజిల్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, సు విధ ఇతర విభాగాల అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. బ్యాంకుల్లో రూ.10 లక్షలకు మించి జరిగే లావాదేవీలపై నిఘా ఉంచాలన్నారు. కంట్రోల్ రూం, సీ విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రకటనలు, ప్రసారాలు, ప్రచారం కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. పోలీసు శాఖకు సంబంధించిన ఫిర్యాదులు, ఇతర ఎన్నికల సంబంధిత అంశాల కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ అతిథి గృహంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు పార్లమెంట్ ఎన్నికల పోలీసు పరిశీలకుడు అందుబాటులో ఉంటారని తెలిపారు. 81438 76383 నంబర్‌లోనూ సంప్రదించవచ్చని సూచించారు. అంతకు ముందు కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన స్వీప్ పాయింట్ వద్ద అధికారులు ఫొటో దిగారు.

కౌటాల: సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావ్‌పేట్, మాకిడి అంతర్రాష్ట్ర రహదారుల్లోని చెక్‌పోస్టులను సోమవారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు వివేకానంద్ రాజేంద్ర జదావర్ పరిశీలించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డీఆర్‌వో లోకేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్

- ఏడు నియోజకవర్గాలకు 190 మంది కేటాయింపు


ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న పరిశీలకులు రాజేంద్ర విజయ్, కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మైక్రోఅబ్జర్వర్స్ ర్యాండమైజేషన్‌ను సోమవారం నిర్వహించారు. సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సమావేశ మందిరంలో ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రక్రియ చేపట్టారు. అదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి 14మంది, బోథ్‌కు 30, ఆసిఫాబాద్‌కు 24, సిర్పూర్‌కు 16, నిర్మల్‌కు 30, ఖానాపూర్‌కు 49, ముథోల్‌కు 27 మంది చొప్పున మొత్తం 190 మందిని కేటాయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్, ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల ఈడీఎంలు, జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడే ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మేడే పోరాట స్ఫూర్తితో పెట్టుబడిదారులు, పాలకవర్గాల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి హక్కులు సాధించుకోవాలన్నారు. కార్మికులు ఐక్యతను కాపాడుకుంటూ మేడే నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు బాలకిషన్, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో 12.. పెద్దపల్లిలో 42

- లోక్‌సభ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులు
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ



నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్న రాథోడ్ రాజు

సాక్షి, పెద్దపల్లి/కైలాస్‌నగర్: ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ పర్వం సోమవారం ముగిసింది. ప్రధాన పార్టీలతోపాటు బరిలో ఉన్న స్వతంత్ర అభ్యర్థుల లెక్క తేలడంతో పోరు మిగిలింది. ఆదిలాబాద్ బరిలో 12మంది, పెద్దపల్లి బరిలో 42మంది ఉన్నారు. ఆదిలాబాద్‌లో సోమవారం మధ్యాహ్నం 3గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉండగా స్వతంత్ర అభ్యర్థి రాథోడ్ రాజు తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషాకు తన ఉప సంహరణ పత్రాలు అందజేశారు. దీంతో పార్లమెంటు ఎన్నికల బరిలో 12మంది అభ్యర్థులు నిలిచారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వంటి ప్రధాన పార్టీల తరఫున ముగ్గురు పోటీలో ఉండగా మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. మరో ఏడుగురు అభ్యర్థులు ఇతర రాజకీయ పార్టీల తరఫున పోటీ పడుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. ఉపసంహరణ ప్రక్రియ ముగిసి, పోటీ పడే అభ్యర్థులు ఖరారు కావడంతో మంగళవారం నుంచి ఎంపీ ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది.

పెద్దపల్లిలో..

పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గానికి 63మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 14మంది నామినేషన్లను తిరస్కరించగా.. సోమవారం నామినేషన్ ఉపసంహరణకు చివరి రోజు కావడంతో పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏడుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ మేరకు ఫాం–5 పూరించి ఆర్వోలకు అందజేశారు. దీంతో 42మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ తదితర ప్రధాన పార్టీలకు చెందిన వారితోపాటు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. రిటర్నింగ్ అధికారులు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, స్వతంత్ర అభ్యర్థుల సమక్షంలో స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.

ఆదిలాబాద్‌లో..		
అభ్యర్థి పేరు	రాజకీయ పార్టీ	గుర్తు
ఆత్రం సక్కు	భారత రాష్ట్ర సమితి	కారు
ఆత్రం సుగుణ	ఇండియన్ నేషనల్ కాంగ్రెస్	చెయ్యి
గోడం నగేష్	భారతీయ జనతా పార్టీ	కమలం
జంగు బాపూ మెస్రం	బహుజన్ సమాజ్ పార్టీ	ఏనుగు
కొడప వామన్‌రావు	గొండ్వానా దండకారణ్య పార్టీ	తుర్హా ఊదుతున్న మనిషి
గేడం సాగర్	ఇండియా ప్రజాబంధు పార్టీ	ట్రంపెట్
రాథోడ్ సుభాష్	ఇండిపెండెంట్	గ్యాస్ సిలిండర్
ఎం.శ్యామ్‌లాల్‌నాయక్	అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్	చపాతి రోలర్
భుక్యా జైవంత్ రావు	స్వతంత్ర అభ్యర్థి	ప్రెషర్ కుక్కర్
నునావత్ తిరుపతి	విద్యార్థుల రాజకీయ పార్టీ	బ్యాట్
చవాన్ సుదర్శన్	అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ	రోడ్‌రోలర్
మెస్రం గంగాదేవి	ధర్మ సమాజ్ పార్టీ	పాదరక్షలు

ఆదిలాబాద్‌లో ఒకటి, పెద్దపల్లిలో మూడు ఈవీఎంలు

ఒక స్థానంలో 15మంది అభ్యర్థులకు మించితే రెండు ఈవీఎంలను ఉపయోగించాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ బరిలో 12మంది ఉండడంతో ఒకటి, పెద్దపల్లి బరిలో 42మంది ఉండడంతో మూడు ఈవీఎంలు వినియోగించాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పెద్దపల్లిలో స్వతంత్ర అభ్యర్థులను ఎన్నికల బరిలో నుంచి తప్పించేందుకు ప్రధాన పార్టీల నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతోనే ఈసారి గతంలో కంటే ఎక్కువ మంది బరిలో నిలిచినట్లు తెలుస్తోంది. 2019లో పెద్దపల్లి లోక్‌సభ బరిలో 18 మంది అభ్యర్థులుండగా, ఈసారి 42 మంది పోటీలో ఉన్నారు. చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఓట్లు చీల్చడం వల్ల ఏ పార్టీకి నష్టం చేకూరుతుంది? ఎంత మేరకు వీరి ప్రభావం ఉండనుందనే చర్చ అన్ని పార్టీల్లో జోరుగా సాగుతోంది.

అంతరాయం లేకుండా నీటి సరఫరా

ఆసిఫాబాద్: వేసవి పూర్తయ్యే వరకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అంతరాయం లేకుండా తాగునీటిని సరఫరా చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి పూర్తయ్యే వరకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ సమస్యలపై వెంటనే స్పందించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకులు, పవర్ బోర్స్ పాయింట్ల ద్వారా సరిపడా నీటిని అందించాలన్నారు. గ్రామాల్లో నీటి సరఫరాను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. గ్రామీణ నీటిపారుదల శాఖ ఈఈ వెంకటపతి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నగదు పట్టివేత

దండేపల్లి: మండలంలోని గూడెం చెక్ పోస్టు వద్ద సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.1,25,200 నగదు పట్టుకున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. రాయపట్నం నుంచి లక్సెట్టిపేట వైపు బొలెరో, కారులో వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద తనిఖీలు చేయగా ఒకరి వద్ద రూ.52 వేలు, మరో వ్యక్తి వద్ద రూ.75 వేలు లభించాయి. వాటికి సంబంధించి వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి విజయ్‌ప్రసాద్, ఏఎస్సై రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



రాథోడ్ దిలీప్ మృతదేహం

లింగాపూర్/లక్సెట్టిపేట: లింగాపూర్ మండలంలోని పిక్లాతండాకు చెందిన రాథోడ్ దిలీప్ (28) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు లక్సెట్టిపేట ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. దిలీప్‌కు నాలుగు నెలల క్రితం సత్యసాయినగర్‌కు చెందిన అరుణతో వివాహమైంది. స్వగ్రామంలో ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో తల్లిదండ్రులు ఏదైనా పనిచేసుకుని బతకండని నెలక్రితం అత్తగారి ఊరైన లక్సెట్టిపేటకు పంపించారు. ఈ నెల 27 అతిగా మద్యం సేవించి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని తల్లి మృతుని తల్లి శోభాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి కూలీ మృతి



నాగయ్య (ఫైల్)

భీమిని: మండలంలోని చిన్న గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీ పంబాల నాగయ్య (74) సోమవారం మృతి చెందినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఉపాధి పని చేస్తుండగా చాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో తోటి కూలీలు ఇంటికి తీసుకొచ్చారు. స్థానికంగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా మృతుని వయస్సు ఆధార్‌కార్డులో 74 సంవత్సరాలు ఉండగా ఉపాధి హామీ జాబ్ కార్డులో మాత్రం 58 సంవత్సరాలు ఉండడం గమనార్హం.

లెక్క లేదంటే.. వేటే..!

- ఎన్నికల్లో ప్రచార వ్యయం వివరాలు సమర్పించాల్సిందే
- వ్యయ పరిశీలనకు ప్రత్యేక అధికారులు



సాక్షి, మంచిర్యాలడెస్క్: ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఆదిలాబాద్‌లో 12 మంది, పెద్దపల్లిలో 42 మంది బరిలో ఉన్నారు. అభ్యర్థుల గెలుపోటములను ప్రచారమూ ప్రభావితం చేస్తుంది. ఆ ప్రచార వ్యయం కూడా పెరుగుతూ వస్తోంది. ర్యాలీలు, సభలు, సమావేశాలు, సభలకు జనాలను తరలించే వాహనాలు, భోజనాలు, టెంట్లు ఇలా ప్రతీ దానికి అభ్యర్థులు ఖర్చు చేయాల్సి వస్తుంది. వీటన్నింటికి కూడా ఎన్నికల సంఘం స్థానికంగా ధరలను అనుసరించి చెల్లింపులను నిర్దేశించింది. ఆ మేరకు వ్యయ వివరాలను అభ్యర్థులు నమోదు చేయాల్సి ఉంటుంది. బ్యాంకులో ఖాతా తెరిచి దాని ద్వారానే చెల్లింపులు చేయాలి. ప్రచార వ్యయానికి సంబంధించి ప్రతీ ఖర్చు వివరాలను ఎన్నికలు పూర్తయిన తర్వాత నెల రోజుల్లోగా ఎన్నికల సంఘానికి సమర్పించాలి. లేనిపక్షంలో ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటిస్తుంది. అలా వేటు పడిన వారిలో రాష్ట్ర వ్యాప్తంగా 107మంది ఉన్నారు.

వ్యయ పరిశీలకులు వీరే..

ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా మహారాష్ట్రకు చెందిన ఐఆర్ఎస్ అధికారి జాదావార్ వివేకానంద, పెద్దపల్లి నియోజకవర్గానికి సమీర్ నైరంతర్య వ్యవహరిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పర్యటించి రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార వ్యయాలను పరిశీలిస్తారు.

107మంది పోటీకి అనర్హులు

రాష్ట్రంలోని 107మందిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ప్రచార వ్యయానికి సంబంధించిన వివరాలు సమర్పించకపోవడంతో ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 10ఏ ప్రకారం అనర్హత వేటు వేసింది. వీరిలో అత్యధికంగా నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన 68 మంది ఉన్నారు. అప్పట్లో పసుపు రైతులు భారీ సంఖ్యలో నామినేషన్ వేసిన వారే కావడం గమనార్హం. వచ్చే జూన్ 23 వరకు వీరు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. నల్గొండ లోక్‌సభ నియోజకవర్గంలోని 2, మహబూబాబాద్, మెదక్‌లో ఒక్కొక్కరు ఉండగా.. వీరిపై జూన్ 10వరకు వేటు కొనసాగుతుంది. జుక్కల్, రామగుండం, కరీంనగర్, గజ్వేల్, మల్కాజ్‌గిరి, నాగార్జునసాగర్, ఆలేరు, జనగాం, మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఒక్కొక్కరు, దేవరకొండ 5, మిర్యాలగూడ, పాలకుర్తి ముగ్గురు చొప్పున, నల్గొండ, ములుగు 4 చొప్పున, నకిరేకల్ 2, మల్కాజ్‌గిరి ఒకరిపై జూలై 14వరకు వేటు వేసింది. పాలకుర్తిలో ముగ్గురిపై ఆగస్టు 25వరకు, డోర్నకల్ ఒకరిపై సెప్టెంబర్ 21వరకు అనర్హత వేటు పడింది.

పెంపు ఇలా..

లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార వ్యయ పరిమితి 1952లో రూ.25వేలుగా ఉండేది. 1971లో రూ.35వేలు ఉండగా.. 1980లో రూ.లక్షకు పెరిగింది. 1984నుంచి 1991వరకు రూ.1.50లక్షలు, 1996లో రూ.4.50లక్షలకు చేరింది. 1998లో రూ.15లక్షలు, 2004లో రూ.25లక్షలకు పెరుగుతూ వచ్చింది. 2014లో ఎన్నికల ప్రచార వ్యయ పరిమితిపై ప్రధాన సవరణ జరిగి రూ.70లక్షలకు పెరిగింది. దీనిపై 2020లో 10శాతం పెరిగింది. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన కమిటీ సూచన మేరకు 2022లో ప్రచార వ్యయ పరిమితిని రూ.95లక్షలకు పెంచారు. లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95లక్షల వరకు ప్రచారానికి ఖర్చు చేసే అవకాశం ఉంది.

'కార్మికుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వం'



మాట్లాడుతున్న జాడి దేవరాజ్

పాతమంచిర్యాల: సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల హక్కులు కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేడే ఉత్సవాలు జరుపుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పడాల రామన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధనకోసం 138 సంవత్సరాల క్రితం కార్మికులు సమ్మె సైరన్ మోగించారన్నారు. నాటి సమ్మెతో 8 గంటల పని దినాల అమలు సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం, జిల్లా కమిటీ సభ్యులు సదుల దేవయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీనివాస్, భీమయ్య, రాములు, లక్ష్మణ్, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

జెనిటిక్ ఇంజనీరింగ్‌పై అవగాహన



సూక్ష్మదర్శినితో పరిశీలిస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహిస్తున్న సైన్స్ సమ్మర్‌క్యాంపులో భాగంగా సోమవారం ప్రపంచ గమనాన్ని మార్చే జీవశాస్త్రంలో భాగమైన జెనిటిక్ ఇంజనీరింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: అగ్నిప్రమాదాల నివారణ, భద్రతపై మంచిర్యాల ఆర్టీసీ డిపోలో సోమవారం తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో కార్మికులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో ఎలా వ్యవహరించాలో ప్రదర్శించారు. ప్రమాదాలు జరిగినప్పుడు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ దేవయ్య సూచించారు. కార్యక్రమంలో డీఎం రవీంద్రనాథ్, ఆర్టీసీ విజిలెన్స్, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ బీఆర్‌రెడ్డి, కానిస్టేబుల్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన గునిగంటి విక్రమ్ (38) భార్య ఆర్నెళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటిపైకప్పుకు చీరతో ఉరేసుకున్నాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ విఫలమవుతుందేమోనని ఆత్మహత్య

- ఉరేసుకుని యువకుడి బలవన్మరణం



నితిన్ (ఫైల్)

వేమనపల్లి: ప్రేమించిన యువతి తనకు దక్కుతుందో.. లేదో.. తమ పెళ్లి జరుగుతుందో.. లేదోనని భయాందోళన చెందిన యువకుడు క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సుంపుటం గ్రామానికి చెందిన ఇగురం వెంకటి, జమున దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. పెద్దకుమారుడు నితిన్ (20) మంచిర్యాలలో డిగ్రీ చదువుతూనే ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం గోదావరిఖనికి చెందిన ఓ బాలికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల అమ్మాయి సుంపుటం గ్రామానికి వచ్చి మూడు రోజులు ఉండి వెళ్లిపోయింది. ఇంట్లో తమ తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, మనం ఎక్కడికైనా వెళ్లి పెళ్లి చేసుకుందాం రమ్మని రెండు రోజులుగా ఒత్తిడి తెచ్చింది. కానీ యువకుడి తల్లిదండ్రులు ముహూర్తం చూసుకుని అమ్మాయి వాళ్ల ఇంటికి వెళ్లి పెళ్లి ఖరారు చేసుకుందామని నచ్చజెప్పారు. ఇంతలోనే తమ ప్రేమ ఎక్కడ విఫలమవుతుందోనని భయపడిన యువకుడు సోమవారం సాయంత్రం గ్రామానికి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి పెద్ద కుమారుడైన నితిన్ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి'

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో కార్మిక కుటుంబాల తాగునీటి కోసం మరిన్ని ఆర్వో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు బండి రమేశ్, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. తాము గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో ఏరియాలోని పలు కాలనీలలో మొత్తం 5 ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని యజమాన్యం ఒప్పందం కుదుర్చుకుని నస్పూర్ కాలనీ, కృష్ణ కాలనీలో మాత్రమే ఏర్పాటు చేసిందన్నారు. శ్రీరాంపూర్ కాలనీ, నాగార్జున కాలనీ, సీసీసీ టౌన్‌షిప్‌లో కూడా వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో సో మవారం గుర్తు తెలి యని వృద్ధుడు (80) వడదెబ్బతో మృతి చెందినట్లు సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే హెడ్‌కానిస్టేబు ల్ కే.సురేశ్ గౌడ్ తెలిపారు. రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంపై ఉన్న పిల్లర్ గద్దెపై పడుకుని వృద్ధుడు మృతి చెందాడన్నారు. మృతుడు లైట్ బ్లూ కలర్ షర్ట్, వైట్ బనియన్ ధరించి ఉన్నాడని, మృతదేహం పక్కన చేతికర్ర ఉందన్నారు. మృతదేహాన్ని సిర్పూర్ (టి)లోని సామాజిక ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీకి బ్రేక్

కోటపల్లి: మండలంలోని రాజారం గ్రామ పంచాయతీలో ఓటరు స్లిప్పుల పంపిణీకి బ్రేక్ పడింది. పార్లమెంట్ ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు ఇటీవల గ్రామస్తులు తీర్మానం చేయగా అధికారులు వారితో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. సోమవారం బీఎల్‌వో రవీందర్, సూపర్‌వైజర్ మధుకర్ గ్రామంలో పోల్ చిట్టీలు పంపిణీ చేపట్టగా గ్రామస్తులు నిరాకరించారు. దీంతో చిట్టీల పంపిణీ నిలిపివేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

మేడే విజయవంతం చేయాలి

మంచిర్యాలటౌన్: మేడే విజయవంతం చేయాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ అన్నారు. సోమవారం మేడే పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బూడిద శ్యాంకుమార్, ఆత్మకూరు తిరుపతి, ఉప్పులేటి రామస్వామి, ఆవుల శ్రీనివాస్, కుమారస్వామి, నవీన్, రవి,వెంకటేశ్, రాకేశ్, శశిధర్ పాల్గొన్నారు.

చక్కర్లు కొట్టిన జెట్ విమానం

వేమనపల్లి: చెన్నూర్–కోటపల్లి మండలాల మీదుగా సోమవారం ఉదయం వేమనపల్లి మండలం వైపు వచ్చిన జెట్ విమానం ఆకాశంలో చక్కర్లు కొట్టింది. ఆర్‌అండ్‌బీ రహదారి మీదుగా మండల కేంద్రం నుంచి కుమురంభీం జిల్లా దహెగాం, బెజ్జూర్ మండలాల వైపు వెళ్లింది. అతి తక్కువ ఎత్తులో నుండి విమానం వెళ్లడంతో ప్రజలు కేరింతలు కొడుతూ ఫొటోలు తీశారు. విమానం చక్కర్లు కొట్టడంతో ప్రాణహిత అవతలి వైపు ఉన్న సరిహద్దు అటవీ ప్రాంతంలో ఏదైనా ఘర్షణ వాతావరణం నెలకొందా? అనే అనుమానాలు వెలువడ్డాయి.

బాల్య వివాహం అడ్డగింత

వాంకిడి: మండలంలోని నవేగాం గ్రామ పంచాయతీ పరిధిలోని టోకిగూడలో పెద్దలు నిశ్చయించిన బాల్య వివాహాన్ని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ ఆధ్వర్యంలో సోమవారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన గిరిజాబాయి, లింగు దంపతుల కుమార్తె (16)కు అదే గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి జరిపించేందుకు పెద్దలు నిశ్చయించుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామాన్ని సందర్శించిన అధికారులు బాల్య వివాహాలపై ఇరు కుటుంబాలకు అవగాహన కల్పించారు. బాలికలకు 18 ఏళ్లు నిండక ముందే వివాహం జరిపిస్తే చట్టరీత్యా నేరమవుతుందన్నారు. ఆర్‌ఐ ప్రమీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పద్మారెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే వినోద్



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ నాయకురాలు తోడే పద్మారెడ్డి అంత్యక్రియలు సోమవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. మంచిర్యాల మున్సిపాలిటీలోని ఇస్లాంపురలో ఉన్న ఇంటివద్ద పద్మారెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

క్రీడల్లో ఉచిత శిక్షణ



బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

- మే 1 నుంచి 31 వరకు శిబిరాలు
- సెలవులను సద్వినియోగం చేసుకోనున్న చిన్నారులు

మంచిర్యాలటౌన్: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇంట్లో ఖాళీగా ఉండకుండా వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఏటా వేసవి సెలవుల్లో మే 1 నుంచి 31 వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వివిధ క్రీడల్లో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందించేలా ఏర్పాట్లు చేసింది. విద్యార్థులు వారికి నచ్చిన క్రీడలో రాణించేందుకు అవసరమైన మెలకువలు నేర్చుకునేందుకు చక్కని అవకాశం.

క్రీడల్లో శిక్షణకు అవకాశం

పట్టణ ప్రాంతాల్లో 6, గ్రామీణ ప్రాంతాల్లో 10 శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఆటల్లో ఆసక్తి ఉండి నేర్చుకోవాలనే జిజ్ఞాస ఉన్న విద్యార్థులకు నాణ్యతతో కూడిన శిక్షణ ఇచ్చేందుకు స్పోర్ట్స్ ట్రెయినర్లు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు సిద్ధంగా ఉన్నారు. నెల రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుంటే పిల్లలకు చదువుతో పాటు ఆటల్లో ప్రావీణ్యం లభిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మే 1 నుంచి 31 వరకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నాం. ఆసక్తి గల విద్యార్థులు శిక్షణ అందించే కోచ్‌ల ఫోన్ నంబర్‌కు కాల్ చేసి శిక్షణలో చేరవచ్చు. మరిన్ని వివరాలకు 9963539234, 9866458725 నంబర్లలో సంప్రదించాలి.

– కే.రాజ్‌వీరు, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి

పట్టణ ప్రాంతాల్లో శిక్షణ శిబిరాల వివరాలు

క్రీడ	నేర్పించే చోటు	కోచ్‌పేరు	ఫోన్ నంబర్
బాక్సింగ్	మంచిర్యాల	రాజేశ్	9963539234
అథ్లెటిక్స్	చెన్నూరు	జే.సంతోశ్	6302254332
వాలీబాల్	మంచిర్యాల	జి.శ్రీనివాస్	9951246104
కరాటే	మంచిర్యాల	నాగలక్ష్మి	9949627059
బాస్కెట్‌బాల్	మంచిర్యాల	నవీన్	7680044330
ఫుట్‌బాల్	మంచిర్యాల	ఎం.కృష్ణ	9700071606
	గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ శిబిరాల వివరాలు		
ఫుట్‌బాల్	కన్నెపల్లి	వనిత	8121305993
వాలీబాల్	అస్నాద్	మనోహర్	9951246104
వాలీబాల్	కలమడుగు	బి.సాగర్	9959708470
వాలీబాల్	కాసిపేట	కే.సాగర్	9885658397
వాలీబాల్	అంకుసం	శ్రీనివాస్	9399956721
తైక్వాండో	చిన్నబూదె	రాజేశ్	9949016997
వుషు	జైపూర్	శివమహేశ్	96525 08672
బాక్సింగ్	బెల్లంపల్లి	రామకృష్ణ	9392486080
సెపక్‌తక్ర	తాళ్లగురిజాల	అశోక్	7989543464
హ్యాండ్‌బాల్	పోలంపల్లి	రాజలింగు	9848681350

'ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గోడం నగేశ్

జన్నారం: ఎన్నికల్లో ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. సోమవారం జన్నారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. దేశాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేసి అగ్రరాజ్యాల సరసన నిలిపారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, ప్రధాన కార్యదర్శి గాజుల దేవేందర్, నాయకులు తిరుపతి, గోలి చందు, రమేశ్‌గౌడ్, వాసాల నరేశ్, మల్లేశ్, సతీశ్, వెంకటేశ్, భాస్కర్, శ్రీకాంత్, మహేశ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి అభ్యర్థులను గెలిపించాలి'



మాట్లాడుతున్న శ్రీనివాస్

పాతమంచిర్యాల: ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టీ.శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న బీజేపీని ఓడించాలన్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి చాంద్‌పాషా, టి.శ్రీనివాస్, బ్రహ్మానందం, అందె మంగ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ముగ్గురికి జైలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల షిర్డీ సాయిబాబా ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరికి 7 నెలలు, స్థానిక రైల్వే స్టేషన్‌లోని ఏటీఎంలో చోరీకి యత్నించిన మరో వ్యక్తికి 45 రోజులు జైలు శిక్ష విధిస్తు జిల్లా కోర్టు న్యాయమూర్తి కే.నిరోషా సోమవారం తీర్పునిచ్చినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. 2023 సెప్టెంబర్ 6న హన్మకొండ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మకాలనీకి చెందిన పాశం ప్రణీత్, ఎండీ.హుమర్ ఫరూఖ్ షిర్డీసాయిబాబా ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో 7 నెలల 15 రోజులు జైలుశిక్షతో పాటు రూ.400 జరిమానా విధించారు. దీంతో పాటు 2024 మార్చి 18న స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏటీఎంలో చోరీకి యత్నించిన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన గౌరవ్ మిశ్రను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువు కావడంతో 45 రోజుల జైలుశిక్షతో పాటు రూ.100 జరిమానా విధించారు.

సింగరేణి అభివృద్ధికి ప్రతిపాదనలు

- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు నివేదించామని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ జనక్ ప్రసాద్ తెలిపారు. సోమవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల గోదావరిఖనిలో జరిగిన యూనియన్ మహాసభలో సింగరేణి సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశామని, వాటి అమలు కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంధన శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిశామన్నారు. రాబోయే ఐదేళ్లలో 8 భూగర్భ గనులు తెస్తామన్నారు. రామగుండం ఏరియాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీంరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, తదితరులు పాల్గొన్నారు.